
సూర్యదేవర
రామ్ మోహన రావు
నాగలోకయాగం-2

తెలుగులో అత్యంత ఎక్కువ సోషల్ నవలలు రాసి రికార్డ్ సృష్టించి
125వ నవలకు చేరువవుతున్న మీ అభిమానరచయిత
**The Number One Best Selling Author**


## సూర్యదేవర రామ్‌మోహనరావు


# నాగలోక యాగం-2

## (రెండవ భాగము)


## మోడల్ పబ్లికేషన్స్

# నాగలోక యాగం-2

"ఇక్కడ ఎవరో వున్నారు ప్రభూ!" అంది భద్రాదేవి.

"లేదే... ఎవరునులేరు."

"ఉన్నారు. మనలను గ్రుచ్చి చూస్తున్నట్టున్నాది."

"ఎవరు?" అంటూ ఫక్కున నవ్వాడు ధనుంజయుడు.

"ఓ అర్థమైనది ప్రియా. చంద్రుడు చూచుచున్నాడనియేగదా నీ సంశయము. ప్రేమికులకు ఆప్తుడేగదా జాబిలి."

"కాదు ప్రభూ! నెలరాజు కాదు."

"వేరెవరు?"

"నేను....."

ఉన్నట్టుండి 'నేను' అంటూ విన్పించిన వికృత స్వరానికి ఉలికి పడ్డారిరువురూ. భద్రాదేవి సందియము వృధా పోలేదు. ఎవరో వున్నారు.

"ఎవరది?" చేతిని ఖడ్గం పిడిమీదకు పోనిస్తూ అరిచాడు ధనుంజయుడు.

"నేనే..." అంటూ ఆ వికృత స్వరం తిరిగి విన్పించింది.

"ఏయ్! బ్రతకాలనుంటే సజావుగా బదులు చెప్పుము. నేనంటే ఎవరు నీవు? ఎచట వున్నావు?" గద్దించాడు.

ఈసారి భయంకరంగా-

వికృతమైన నవ్వు విన్పించింది.

ఆ నవ్వు కొండకోనల్లో మారుమ్రోగింది.

ప్రశాంతంగా గూళ్ళలో వున్న పక్షులు కకావికలై గాల్లోకి ఎగిరాయి. ధనుంజయ భద్రాదేవిలు ముఖముఖాలు చూసుకున్నారు. నవ్వు ఆగిన వెంటనే- "నేను భూతాన్ని... నన్ను మీరు చూడలేరు. నన్ను చూచినంతనే గుండె పగిలి చచ్చెదరు." అంటూ మాటలు విన్పించాయి.

ఈసారి భద్రాదేవి మాట్లాడింది.

"నువ్వు భూతానివైతే మాకేమీ... ప్రేతానివైతే మాకేమి? ఎక్కడున్నావు?" అంటూ గద్దించింది.

"నేనీ వట వృక్షాన్ని ఆశ్రయించి ఎంతో కాలంగా వుంటున్నాను. ఈ మండపమందు నిద్రించు మానవుల జంపి నెత్తురుతాగి బతుకుతున్నాను. నానుంచి మీరు తప్పించుకోలేరు. చాలా రోజుల పిమ్మట నేడు నా పంట పండినది. మీ నెత్తురుతో నాకు విందు భోజనమే. హ్హా హ్హా హ్హా" అంటూ కొండ చరియలు విరిగిపడుతున్నట్టు నవ్వింది భూతం.

"ఏయ్! నీవంటి పిరికి భూతాలనేకం జూచితిమి. నీకంత శక్తి ఉన్నచో మా ముందుకొచ్చి మాటలాడుము." అంది భద్రాదేవి.

"ఏయ్! నేను పిరికి భూతాన్ని కాదు. ఒక్క గుద్దుకు మీరు నెత్తురు కక్కుకుని చచ్చెదరు" అంది భూతం.

ఆ వెనకే వటవృక్షం కొమ్మ ఒకటి కిరకిరలాడుతూ విరిగిపడింది. ఆ కొమ్మనుంచి నల్లటి వికృతాకారం ఒకటి తమవైపు గాల్లో తేలుతూ రావటం ఇద్దరూ చూసారు. దాని కళ్ళు ఎర్రగా నిప్పు ముద్దల్లా వున్నాయి. అదినేరుగా మండపము వంచకువచ్చి ఎదురుగా గాల్లో నిలబడింది.

బహుశ భద్రాదేవి గురించి ఏమాత్రం ముందుగా తెలిసినా ఆ భూతం ఎదురుగా వచ్చేదికాదేమో. నేరుగా భద్రాదేవి ఎదురుగా వచ్చి నిలవటంతో ఆమె వశీకరణ ప్రయోగానికి వెంటనే లోబడిపోయింది. పులిలా ఉగ్రంగా వచ్చిన భూతంకాస్తా పిల్లిలా శాంతంగా మారిపోయింది. అంతే-

సవినయంగా ఆమె సమీపంలో మోకాళ్ళ మీద కూచుని నమస్కరించింది. దాని ఆకారం నల్లగా భయంకరంగా వుంది. అది ఆడభూతం. "మీ గురించి తెలీక ఏదో వదరితిని. నను మన్నించమ్మా" అంటూ వేడుకుంది.

ధనుంజయుడు విభ్రాంతుడై-

అలా చూస్తున్నాడు.

"నీ నామధేయమేమి?" భూతాన్ని ప్రశ్నించింది భద్రాదేవి.

"నేను ఘృతాచియను భూతమును" బదులిచ్చింది భూతం.

"ఏ ప్రాంతం నుండి యిటకు వచ్చితివి?"

"వైతరిణీ నదీ ప్రాంతమందు ఒక మాంత్రికుడు నన్ను పట్టుగొని వచ్చి యిచట వదిలిపోయినాడు. నాటినుండి ఆ వటవృక్షము నాశ్రయించి వుంటిని."

"సరి. ప్రస్తుతము నీవు నా వశమందుంటివి. ఉంటివి గదా?"

"అయ్యో ఎంతమాట. నేను మీ సేవకురాలిని. మీ ఆజ్ఞా బద్ధురాలిని. ఏమి చేయవలె?"

"కావలి... అప్రమత్తురాలివై ఈ రేయి మాకును, మా అశ్వములకును కావలి కాయవలె. ఈ మండపము వైపు మృగసర్పాదు లేవియును చేరి మమ్ము బాధింపకుండ జూడవలె. మా ఏకాంతమునకు విశ్రాంతికి భంగము వాటిల్లరాదు సుమా..."

"చిత్తము. మీ సేవకురాలిని మీ ఆజ్ఞాబద్ధురాలిని" అంటూ నమస్కరించి రివ్వున గాల్లో తేలుతూ దూరంగా వెళ్ళిపోయింది ఘృతాచియనే ఆ భూతం.

అంతవరకు వినోదం చూస్తున్న ధనుంజయుడు-

ఉన్నట్టుండి ఫక్కుమని నవ్వాడు.

అదిచూసి వెక్కిరింపుగా భావించి-

ముఖం ముడుచుకుంది భద్రాదేవి.

"ఏమైనది ప్రభూ! అంతగా నవ్వితిరి?" పొడిగా అడిగింది.

"ఇంకనూ ఏమేమి కానున్నదో తెలియదు గదా. అది తలచిన నవ్వువచ్చినది."

"ఒకింత అవగతమగునటుల నుడువ వచ్చునుగదా!"

"ఏమున్నది. అంతా వశీకరణమే. రాజవశ్యమే... నేనే నీ వశమైతిని గదా.... మృగ వశ్యమ్... అంతటి మృగరాజే నీ వశమైనాడు. సర్పవశ్యమ్... పామును రప్పించి తండాలోని బాలుడ్ని కాపాడినపుడే తెలిసిపోయినది. సర్పములు నీ వశమని. ఇక భూతవశ్యమ్. ఇప్పుడు ప్రత్యక్షముగ వీక్షించితిని. ఘృతాచి నీ వశమైనది. ఇంకను వేరేమి నీకు వశంకానున్నవో తలచి నవ్వితి" అంటూ తన నవ్వుకి అర్థం వివరించాడు.

అంతా విని మరింత ముఖం ముడుచుకుని కూచుంది భద్రాదేవి. కొన్ని లిప్తల తర్వాతగాని ఆమె అలుకను గుర్తించలేదు ధనుంజయుడు.

ఓ చేత్తో లతవంటి ఆమె నడుంని చుట్టి ఒడిలోకి లాక్కున్నాడు. ముఖంలోకి తొంగి చూసాడు. జాబిలి జిలుగు వెలుగులో ఆమె ముఖ పద్మాన్ని ఎంత వీక్షించినా తనివి తీరదనిపించింది.

"ప్రియా.. నీవిలా అలుక బూనిన సైపజాలనని తెలియదా? ఇప్పుడు నేనేమి కువచనము పలికితినని ఈ కినుక?" అంటూ లాలనగా అడిగాడు. ఆ అన్నులమిన్న అలకలో మరింతగా ముద్దొస్తోంది.

"కువచనముగాదులే ప్రభూ. మీ మనసునమాటే పలికినారు. ఏమి? నా వశీకరణమునకు మీరు నా వశమైతిరా? మీ మీద వశీకరణము ప్రయోగించితినా? ఎంతమాట! మనసావాచా నావలెనే మీరును నను వలచితిరనుకొంటిగాని ఇలాంటి అపోహ ఒండు మీ మనమున గలదని తలచనైతి. పోనిండు. ఇప్పటికైనా బయటపడినారు. ఇకమీదట మనము ఎడముగా ఉండుటయే మేలు." అంటూ ఒడిలోంచి పక్కకు జరగబోయింది.

కాని ధనుంజయుడు విడువలేదు.

భద్రాదేవి అలిగిన కారణం అప్పటిగ్గాని అర్ధంకాలేదు. ఏదో పరిహాసమున మాట పెదవి దాటినది. ఆమె నొచ్చుకొనుటలో ఆశ్చర్యములేదు. పొరబాటు జరిగినది. ఇప్పుడీ పూబోణిని ప్రసన్నం చేసుకొనుట ఎలా?

"నా ఉద్దేశము అదికాదు భద్రా. నేనుగా నీ వశమైతిగాని నీవే వశీకరణమును నాపై ప్రయోగించలేదు. అపార్ధము జేసుకొని నన్ను వేధించుట న్యాయముకాదు."

"క్షత్రియ కులతిలకమగు తమను వేధించునంతటి దాననుగాను."

"ఊహుఁ! పొరబాటున మాట జారితి. మన్నించుమని వేడుకొందునా?"

"అంతటి మాటలెందుకులెండి ప్రభూ! నేనూ మీదాసిని. ప్రభువులు దాసిని మన్నింపు కోరకూడదు."

"వేరేమి చేయవలె? సదా సిరివన్నెల సౌందర్యరాశివి. నేనుగా నీ సౌందర్యమునకు దాసుడనైతి. చాలునా... ఇప్పుడు నీ అలుక తీర్చు మార్గమెయ్యెది?" అంటూ భద్రాదేవిని తిరిగి బిగికౌగిట బంధించి ముద్దులతో అభిషేకించాడు. బావమాలి బ్రతిమాలి చివరికి ఎలాగో ఆమెను ప్రసన్నంచేసుకోగలిగాడు. భద్రాదేవి కూడ కొసరి కొసరి ముద్దులిచ్చి మురిపించింది. చివరికి ఆమె ముంగురులు సవరించి అడిగాడు- "భద్రా! ఇప్పుడైనా నీ వివరములు వినవచ్చునా? చెప్పవా?" అంటూ.

"ఇప్పుడా ప్రభూ!"

"ఇప్పుడే దేవీ. ఇంతకన్నా మనకు ప్రశాంతమగు సమయము చిక్కునా? పోగ పోగ ఏమి జరుగునో ఏమో. సంశయింపక వివరించుము."

అతడి కౌగిలి వీడి ఎడంగా-

పద్మాసనం వేసుక్కూచుంది భద్రాదేవి.

"చెప్పండి ప్రభూ! ఈ రాత్రికే నా గురించి తెలుసుకొనదలిచినారా?" అడిగింది.

"సందేహమేల ప్రియా! నీవు తెలుపవలె. నేను వినవలె."

"నా గురించి చెప్పుటకు ముందుగా మా వంశమూలము గూర్చి తెలుపవలె. అనగా మనమొక పరి కలియుగారంభకాలమున ఏమి జరిగినదో తెలుసుకోవలె."

"ఆరంభకాలమున ఏమున్నది. ద్వారక నీటమునుగుట, మా పెద్దలు పాండవులు స్వర్గారోహణ చేయుట పరీక్షిత్తు ప్రభువగుట ఇత్యాదులేగదా."

"అవును. పరీక్షిత్తు మీ చంద్రవంశాభివృద్ధికి కారకుడు. కలిపురుషునే శాసించిన మహాశక్తివంతుడైన ధర్మ ప్రభువు. కాని ఎంత గొప్పవారయినా ఏదో ఒక తప్పుచేయక మానరు. పరీక్షిత్తూ విషయమున అదే జరిగినది. ముని బాలకుడి శాపవశాన వారం దినములలో తక్షకుడను సర్పముచే మరణించనున్నాడు. ఆ సమయమున ఏమి జరిగినదో ముందుగా వివరించెద." అంటూ చెప్పటం ఆరంభించింది భద్రాదేవి.

✧ ✧ ✧ ✧ ✧

భానుడు నెత్తిన నిప్పులు చెరుగుతున్నవేళ.

చెట్లు ఆకులు కదల్చటం లేదు.

పక్షులు ఎండకు భయపడి గూళ్ళను వదిలి రావటం లేదు. అడవంతా నిశ్శబ్ధమై గుబులు పుట్టిస్తున్నవేళ ఆ సమయన–

ఉక్కపోతకు చెమటలు గ్రక్కుతున్న శరీరంతో ఒక నడి వయసు భూసురుడు కాళ్ళకు చెప్పులు కూడ లేక రాజధాని హస్తినాపురికి గుడ్డ సంచి భుజాన వేసుకొని నడిచిపోతున్నాడు.

అది మండు వేసవికాలం.

పరీక్షిత్తూ మహారాజు ప్రాణాలమీదికి తెచ్చి నదికూడ ఆ వేసవి కాలమే.

క్షత్రియులుకు, అందునా రాజ్యమును పాలించు ప్రభువులకు వేట ఒక వ్యసనము. అయితే కౄరమృగాలను వేటాడి, ప్రజల్ని పరిరక్షంచాల్సిన బాధ్యతకూడ రాజన్యులపై వుంది. ఆ విధంగా చూసినపుడు పరీక్షిత్తూ మహారాజు తన తండ్రియగు అభిమన్యునివలెనే అవక్రపరాక్రమవంతుడు, మహావీరుడు, ధర్మప్రభువు. ప్రజలుమెచ్చిన పరిపాలకుడు.

తన రాజ్యంలో ఎక్కడెక్కడ తన ప్రభావంచూపాలో చెప్పి కలిపురుషుడినే శాసించిన మహాశక్తివంతుడు, ధీరోదాత్తుడు. కాని... ఎంతటి గొప్పవాడైనా,

న్యాయధర్మాలు తెలిసివున్నా కూడ ప్రారబ్ధకర్మననుసరించి ఒక్కోసారి అనుచితంగా ప్రవర్తించి భంగపడతారు. పరీక్షిత్తూ విషయంలో కూడ అదే జరిగింది.

సమీపంగా సపరివారంగా అడవికి వేటకెళ్ళి కొద్ది రోజులు అక్కడే వున్నాడు. వేట చివరి రోజు.

మృగయా వినోదంలోపడి తన పరివారానికి దూరమయ్యాడు. అసలే వేసవికాలం. దప్పికతో ఒక ముని ఆశ్రమానికి చేరుకున్నాడు. దాహానికి నీరు అడిగాడు. తపోనిష్టలో వున్న ముని పరీక్షిత్తును గమనించలేదు.

ఏమీ... తనంతటి రాజన్యుడు స్వయంగా దాహార్తితో వస్తే పట్టించుకొనక పోవుటయా... ఇంత అహంకారమా అని కోపించి సమీపములోని ఒక చచ్చిన సర్పమృతదేహాన్ని ముని మెడలోవేసి అవమానించి తన దారిన వెళ్ళిపోయాడు.

పిమ్మట వచ్చి చూసిన ఆ మునీంద్రుని కుమారుడు కోపోద్రిక్తుడై- "చచ్చిన పాముని మెడలో వేసి నా జనకుని అవమానించిన ధూర్తుడు ఎంత గొప్పవాడైనాగానీ, నేటికి వారము దినములలోపల తక్షకుడనే పాముకరిచి మణించుగాక" అంటూ ఘోరంగా శపించాడు.

ఆ ముని పుత్రునికి శాపమిచ్చుటేగాని వెనక్కి తీసుకోనుట తెలీదు. మునీంద్రుడు జరిగినదానికి బాధపడి, వెంటనే తగు జాగ్రత్తలు తీసుకోమని హస్తినకు కబురంపాడు.

పరీక్షిత్తు మహారాజు వూహించని పరిణామం యిది. ఇప్పుడు పరితపించి ప్రయోజనం లేదు. తక్షకుడి నుండి ఎలా తప్పించుకోవాలో అర్థంకాలేదు. మంత్రుల సలహామేరకు వెంటనే పరీక్షిత్తు ఒంటి స్తంభం మెడలోకి మారాడు. పాములు ఏవీరాకుండా ఆ మేడనుచుట్టి అగ్నివలయం ఏర్పరిచాడు. ఒక్క బ్రాహ్మణులు తప్ప ఎవరూ లోనకు పోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసారు. అంతేకాదు-

తక్షకుడి నుండి తనను కాపాడిన వారికి ఎనలేని ధనకనక వస్తు వాహనాలు కానుక యిస్తానంటూ తన రాజ్యమంతటా ప్రకటించాడు.

అప్పటికి అయిదు దినాలు గడిచిపోయాయి. ఈ విషయం తెలిసిన తన భార్య సలహా మేరకు అగ్నిభట్టారకుడను ఆ భూసురుడు పరీక్షిత్తును కాపాడేందుకు హస్తినకు బయలుదేరిపోతున్నాడు.

అగ్నిభట్టారకుడికి భార్య యిద్దరు కొడుకులు. అదే అతని కుటుంబం. అతను గొప్పదైవ భక్తుడు. వేదవేదాంగాలు చదివాడు. అంతకుమించి సిద్ధవైద్యుడు. ఆపైన గొప్ప పాము మంత్రవేత్త. ఎలాంటి సర్పమైనా అతడి ముందు తలవంచాల్సిందే. గ్రామంలో వున్న కొద్దిపాటి భూమిలో సేద్యం చేసుకుంటూ పదిమందికీ వైద్యం చేసుకుంటూ పేదరికంలోనే గడుపుతున్నాడు.

ఎంతగొప్ప విద్యావేత్త అయినా రాజాదరణ వుంటేనే రాణించగలడు. కాబట్టి తగు సమయం వచ్చినదని భార్య సలహా ననుసరించి బయలుదేరాడు.

అలా మండు టెండలో అడవిదారిన నడిచిపోతున్నాడు. సాయంకాలానికిగాని హస్తినకు చేరలేడు. ఇంతలో–

తన వెనక ఎవరో నడిచి వస్తున్న అలికిడయినది. తల త్రిప్పిచూసాడు. వస్తున్నతని రూపురేఖలు చూసి ఆశ్చర్యపడుతూ కొన్నిక్షణాలు అక్కడే ఆగిపోయాడు.

తనే ఎనిమిదడుగుల పొడగరికాగా–

అతడు తనను మించి పదడుగుల పొడవున్నాడు. కృష్ణవర్ణంలో సన్నగా రివటలా వున్నాడు. తనలాగే నడివయసు వుంటుంది. బోడిగుండు వెనుక పొడవుగా పిలక గాలికి రెపరెపలాడుతోంది. ఎగుడు దిగుడు కనుబొమలు కాస్త ఎత్తుపళ్ళు, ఛాతీకి అడ్డంగా జంధ్యంపోగు.

ఎరుపుపట్టు పంచెకట్టి భుజాన ఉత్తరీయం వేసుకున్నాడు. వేరే ఏ ఆచ్ఛాదనాలేదు. నుదుట, భుజాలమీద ఛాతీమీద విభూది రేఖలున్నాయి. చేతిసంచి ఒకటి పుచ్చుకుని పాదుకలు టకటకలాడించుకొంటూ వేగంగా నడిచి వస్తున్నాడు.

అతడు ఎవరనేది అగ్నిభట్టారకుడికి అర్థంకాలేదు. కాని ఎవరో బ్రాహ్మణోత్తముడని వూహించుకున్నాడు. అతడు చాలా వేగంగా నడుస్తున్నాడు. చూస్తుండగానే తనకు సమీపించేసాడు. దాటిపోబోతూ ఎందుకో అనుమానం వచ్చి అగ్నిభట్టారకుని వంక చూసాడతడు.

"స్వామీ! ఇంత ఎండన బడిపోవుచుంటిరి. ఎవరు మీరు? ఎచటకు పోవుచుంటిరి?" అనడిగాడు.

"మీరును ఎండనబడే పోవుచుంటిరి గదా, ఎచటికి?" అంటూ ఎదురు ప్రశ్నించాడు అగ్నిభట్టారకుడు.

"నా పయనము హస్తినకు. పరీక్షిత్తు మహారాజును కాపాడవలె" అన్నాడతను.

"నేనును ఆ పనిమీదే పోవుచుంటి" అన్నాడు అగ్నిభట్టారకుడు.

"బాగున్నది. నీవు మంత్రవేత్తవా?"

"అవును మహాశయా."

"తక్షకుని నుండి ప్రభువును కాపాడగలవా?"

"తప్పక కాపాడగలను."

"నిజముగా కాపాడగలవా?"

"నిక్కముగా."

"ఓహో! నీ శక్తిని పరీక్షింపవలసినదే."

"ఎందులకు మీకీ సందేహము. మీరును మంత్రవేత్త అయివుందురు, అందుకే ప్రభువును కాపాడుటకు బయలుదేరితిరి."

"కాదు." అంటూ వికటంగా నవ్వాడు ఆ వ్యక్తి.

"కాదా...!"

"అవునయ్యా! నేను బయలుదేరినది ప్రాణములు కాపాడుటకుగాదు. పరీక్షిత్తు ప్రాణములు తీయుటకు. నేనెవరో తెలుసా? హాలాహలముతో సమమగు అతి భయంకరమైన విషము గ్రక్కు సర్పశ్రేష్టుడను, తక్షకుడను."

"తక్షకుడవా...!" నివ్వెరపోయాడు అగ్నిబట్టారకుడు.

"అవును. నేనే తక్షకుడను. నా శక్తి నీకు ప్రదర్శించి చూపెద." అంటూ తన సర్పరూపాన్ని ధరించాడు తక్షకుడు.

సన్నగా పదిబారల పొడవున చిక్కటి కాటుక రంగులో ఎండకు నిగనిగా మెరిసిపోతోంది కృష్ణసర్పం. సర్పం సన్నగా వున్నప్పటికీ పడగ చేటంత వుంది. అటుయిటు చూసి చరచరా బాటపక్కకు వెళ్ళాడు తక్షకుడు.

పెద్ద మోదుగవృక్షం ఒకటి అక్కడ ఏపుగా పెరిగి వుంది. భీకరంగా బుసలు కొడుతూ వెళ్ళి ఆ చెట్టు మాను మీద కాటేసి విషం గ్రక్కాడు తక్షకుడు. అంతే-

పిడుగుపాటుకు గురైనట్టుగా జవజవలాడిందా మోదుగవృక్షం. చూస్తూండగానే భగభగమంటలు వ్యాపించి కొద్దిసేపట్లోనే పచ్చని చెట్టుకాస్తా

భగ్గున కాలి బూడిదయినది. తిరిగి బ్రాహ్మణ రూపు ధరించి అగ్నిభట్టారకుడి ముందు నిలబడి తన ఎత్తుపళ్ళతో వికారంగా నవ్వాడు తక్షకుడు.

"జూచితివిగదా నా విష ప్రభావము. ఇక చూపించు నీ మంత్ర ప్రభావము. ఏదీ... కాలి బూడిదైన ఆ వృక్షమును తిరిగి సజీవముగా నిలుపగలవా?" అనడిగాడు.

"తక్షకా...! ఓసారి వెనుతిరిగి చూడుము" అన్నాడు నవ్వుతూ అగ్నిభట్టారకుడు.

చూసిన తక్షకుడు నివ్వెరపోయాడు.

తన కళ్ళను నమ్మలేకపోయాడు.

కట్టెదుట ఎప్పటిలా సాక్షాత్కరించి వుంది మోదుగవృక్షం. ఆకు కూడ కాలిన గుర్తులేదు. ఇంతవరకు తన విషానికి తిరుగులేదని గర్వించే వాడు, అలాంటిది కాలిబూడిదైన పచ్చని చెట్టును యధాతథంగా నిలపటం సాధ్యమేనా? తను వెనుతిరిగే లోపలే తన మంత్ర ప్రయోగంతో వృక్షాన్ని సజీవంగా యధాతథంగా నిలిపిన ఇతడి మంత్రశక్తిని ఎంత పొగిడినా తక్కువేగదా. ఇలాంటివాడు హస్తినకు వస్తే తను పరీక్షిత్తును వేటు వేయగలడా? వేసి ప్రాణం తీయగలడా? ఇతను తప్పక పరీక్షిత్తు మహారాజును రక్షించపగల సమర్థుడు. ఇతన్ని ఏదో విధంగా వెనక్కి పంపించకుంటే తన లక్ష్యం నెరవేరదు. ముని బాలకుని శాపాన్ని నిర్విఘ్నంగా నెరవేర్చలేడు.

ఈవిధముగా పలుతెరంగుల యోచించిన తక్షకుడు అగ్నిభట్టారకుడి ముందు సాష్టాంగపడి నమస్కరించి లేచాడు.

"ఆహా... ఏమి నా అదృష్టము. తమ దర్శన భాగ్యముతో నా జన్మ తరించినది గదా. ఏమి మీ మంత్ర మహిమ! మీ విద్వత్తును గుర్తించనేరని మీ ప్రభువు పరీక్షిత్తు మిక్కిలి దురదృష్టవంతుడు గదా. పేదరికమున యిటల మండుటెండన కాలినడకనపోవు దుస్థితి ఆయ్యెనుగదా తమకు. భూసరోత్తమా! పోనిండు, పరీక్షిత్తు గుర్తించకున్న ఏమాయె. ఈ తక్షకుడు మీ శక్తిని గుర్తించినాడు." అంటూ మోయగలిగినంత రెండు గంపెడు సంచులనిండుగా వెలకట్టలేని మణిమాణిక్యాది నవరత్నాలు, బంగారు నాణెలను అతడి ముందుంచాడు.

"ఇవి నేను మీకిస్తున్న కానుక. విప్రవర్యా! మీ దారిద్ర్యము తొలగిపోవుటకు ఈ సంపద చాలదా? మిము గుర్తించని పరీక్షిత్తును మీరు కాపాడనేల? యోచింపుము. ఈ సంపద తీసుకుని గృహము చేరుకొని నిశ్చింతగా వుండండి. నేను వెళ్ళి నా కార్యమును నెరవేర్చుకొని పోయెద... ఏమందురు? నా విన్నపము మన్నించి గృహమునకేగుట మంచిది. శ్రమదమాదులకోర్చి హస్తిన పోనేల? పరీక్షిత్తు ఇంతకన్నా అధిక సంపదనిచ్చునా?" అంటూ తెలివిగా వేడుకున్నాడు.

అంతటి అగ్నిభట్టారకుడు కూడ తక్షకుని ప్రలోభానికి లొంగిపోయి హాయిగా ఆ రెండు సంచులు తీసుకుని కొంప చేరుటే ఉచితమని భావించాడు. మారుమాటాడక కనులు చెదిరిన మణులతో కూడిన సంచుల్ని అందుకుని గృహోన్ముఖుడయ్యాడు. తక్షకుడు సంతోషంగా ముందుకు సాగిపోయాడు.

ఆ రోజు సాయంకాలానికే-

హస్తినకు చేరుకున్నాడు తక్షకుడు.

అది సూర్యుడస్తమించువేళ.

బ్రాహ్మణ వేషధారియగు తక్షకుడు నిరాటంకముగా భద్రాతా ఏర్పాట్లను అగ్నివలయాల్ని దాటుకొని పరీక్షిత్తు కొలువైవున్న ఒంటి స్థంభం మేడలో ప్రవేశించాడు. లోన విశాలమగు సభా మందిరంలో సింహాసనాన్నధిష్టించి వున్నాడు పరీక్షిత్తు మహారాజు. ఎటుచూసినా బ్రాహ్మణులే కన్పిస్తున్నారు.

ప్రభువు పరీక్షిత్తు క్షేమంకోరి ఋత్విక్కులు అక్కడ గొప్ప యాగం నిర్వహిస్తున్నారు. కొందరు తమ రేడును తక్షకుడి నుండి కాపాడమని ప్రత్యేకంగా రుద్రపూజలు చేస్తూ ప్రార్థిస్తున్నారు.

తక్షకుడు నేరుగా పరీక్షిత్తు మహారాజు ముందుకు వెళ్ళాడు. వినయంగా ప్రణామం చేసాడు పరీక్షిత్తు. తక్షకుడు స్వస్తి వాచకం పలికి ఆశీర్వదించి చక్కటి ఒక నిమ్మపండును కానుకగా పరీక్షిత్తు చేతిలో వుంచాడు.

పసిమి రంగులో వూరిస్తున్న ఆ నిమ్మపండును యధాలాపంగా వాసన చూసాడు పరీక్షిత్తు మహారాజు. అప్పుడు- సరిగ్గా అప్పుడు జరిగింది ఎవరూ వూహించని ఘోరసంఘటన. ఎప్పుడైతే మహారాజు నిమ్మపండు ఆఘ్రాణించాడో ఆ మరులిప్తలో అక్కడ బ్రాహ్మణుడు అదృశ్యమై నిమ్మపండును చీల్చుకొని

బయటికొచ్చి పరీక్షిత్తు నాసికమీద కాటువేసాడు. తన పని పూర్తిగావటంతో అక్కడి నుండి అదృశ్యమయ్యాడు. పరీక్షిత్తు పొలికేకతో ఆ ఒంటిస్తంభం మేడ మారుమ్రోగింది. అంతే- ఒక్కసారిగా హాహాకారాలు చెలరేగాయక్కడ. అటు సూర్యుడు అస్తమిస్తూండగా యిటు పరీక్షిత్తు కూడ తక్షకుని కాటుతో అస్తమించాడు. క్షణాల్లో ఈ ఘోరవార్త హస్తిన అంతటా ప్రాకిపోయింది. నగరాన్ని చీకట్లు మూసురుకునే సరికి నగర వాసులంతా శోకసముద్రంలో మునిగిపోయారు.

✧ ✧ ✧ ✧ ✧

తమ ప్రభువును కాపాడ ఉదయం వెళ్ళిన తన భర్త అగ్నిభట్టారకుడు చీకటి పడకముందే ఇంటికి చేరటం చూసి అతడి భార్య ఆశ్చర్యపోయింది. పిమ్మట జరిగింది తెలుసుకుని ఆగ్రహంతో మండిపడింది.

“ఏమిది స్వామీ! మీరు చేసిన పని? సిరిసంపదలు కోరి ఎన్నడైననూ మిమ్ము సతాయించితినా? పేదరికము మనకు కొత్త కాదుగదా. ప్రభువులను కాపాడిన సిరిసంపదలు కీర్తిప్రతిష్టలు లభించునని ఆశపడితినిగాని యిలా ప్రలోభమునకు లోబడి పుచ్చుకున్న సంపత్తి కోసముగాదు. ఈమాత్రపు సంపద మనకు పరీక్షిత్తుల వారు యివ్వరా?

ప్రభుభక్తి దేశభక్తి లేని ప్రజలు రాణించరు. అయ్యో... ప్రజలను కన్నబిడ్డల్లా పాలించు ధర్మప్రభువు పరీక్షిత్తుల వారిని కాపాడిన కీర్తిప్రతిష్టలు మీకు చెందకుండా పోయినవే. మీరు చాలా గొప్పవారు. అది నాకు తెలుసు. ఇంతకాలము గొప్పగాను ధర్మబద్ధంగానే జీవించినాము. ప్రభువును కాపాడలేని మీ విద్వత్తు మంత్రశక్తి నిరుపయోగము గదా... మనకీ సంపద వలదు. ఆ తక్షకుడు హస్తినకుపోయి ప్రభువులను ఏమి చేయునో గదా... స్వామీ! ఆలస్యమేల. మరలిపొండు. హస్తినకు పోయి పరీక్షిత్తుల వారిని కాపాడి రావలె. మీరాపని చేయకున్న భూదేవి ఆనగా పలుకు చుంటిని. జీవితకాలం ఇక మీతో మాటలాడుదానను గాను.” అంటూ హెచ్చరించింది.

భార్య మాటలాలకించిన అగ్నిభట్టారకుడు ఖిన్నుడైనాడు. అప్పటిగ్గాని తను చేసిన పొరబాటు ఏమిటో అర్థంగాలేదు. ఆ చీకటి రేయి ఎలా వచ్చినవాడు అలా తిరిగి హస్తినకు బయలుదేరాడు. ఈసారి తండ్రిని ఒంటరిగా రాత్రివేళ పంపించటం ఇష్టంలేక కొడుకు లిద్దరూ తోడుగా వెంట నడిచారు.

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Nagalokayagam+2](http://kinige.com/book/Nagalokayagam+2)

* * *